నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 27 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

చెన్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్గం కాంగ్రెస్ నాయకులు

# ఎన్ని అరాచకాలు చేసినా పట్టించుకోలేదు

**మన పార్టీ వాళ్లే కదా..అని ఓపిక పట్టిన ఘన చరిత్ర ఎమ్మెల్యేది**

- ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు
- రోజురోజుకీ చర్చనీయాంశమవుతున్న చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విబేధాలు

మంచిర్యాల, మే 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చెన్నూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల ముందే ఎమ్మెల్యేపై చెన్నూర్ సీనియర్ లీడర్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి తిరగబడ్డారు. 'ఎమ్మెల్యే బీజేపీలోకి పోతున్నడా, బీఆర్ఎస్‌లోకి పోతున్నడా' అంటూ అనుమానాలు ఉన్నాయంటూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే వివేక్‌ను సొంత నియోజకవర్గ లీడర్లే పట్టించుకోని పరిస్థితి వచ్చిందని లోకం కోడై కూసింది. కాగా చెన్నూర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న హేమంత్‌రెడ్డి తన ఇంటి సమీపంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేపై జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చేసిన వ్యాఖ్యలను హేమంత్‌రెడ్డి ఖండించారు. రాజిరెడ్డి దందాలు బంద్ అయినందుకు, ఆయన పని లేదీ ముందుకు సాగకపోవడంతో ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదన్నారు. చెన్నూర్‌లో ఇన్ని రోజులు ఎన్నో అరాచకాలు నడిచినా మనోళ్లే కదా..మన పార్టీ వారే కదా అని పట్టించుకోకుండా, ఓపిక పట్టిన ఘన చరిత్ర ఎమ్మెల్యే వివేక్ సార్‌ది అని అన్నారు. ఆయన మంచి మనసులో అందరినీ ఒకేలా చూస్తూ, క్షమించినందుకు ఈ శిక్ష వేస్తారా ? అంటూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు చెన్నూర్ కాంగ్రెస్ పార్టీలో పెద్ద దుమారాన్ని రేపాయి. ఎమ్మెల్యే వివేక్ సపోర్ట్‌తో ఇన్ని రోజులు రాజిరెడ్డి దందాలు చేశారని, ఇప్పుడు ఆ దందాలు వద్దు అన్నందుకే రాజిరెడ్డి అలా మాట్లాడారంటూ ఆ పార్టీ నాయకులే ప్రెస్ మీట్ పెట్టి మరీ చెప్పడం గమనార్హం. సొంత పార్టీ నాయకులపైనే ఎమ్మెల్యే అనుచరవర్గం నాయకులు చేసిన ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీరుపై చెన్నూర్ స్థానికులు మండిపడుతున్నారు. ఇలాంటి ప్రెస్‌మీట్ ఎప్పుడూ చూడలేదంటూ ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యల వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి.

# సమస్యలు పరిష్కరించండి సారూ..

**ప్రజావాణిలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతుల వెల్లువ**

- భూములు లేనివారికి పరిహారం ఇచ్చారంటూ పోచంపాడు గ్రామస్తుల ఫిర్యాదు
- కరెంట్ పోల్స్ కోసం 80 చింతచెట్లు నరికిన విద్యుత్‌శాఖ
- రైతులను వేధించడంపై అటవీ అధికారులపై కలెక్టర్ సీరియస్
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలంటూ ఆదేశాలు

అర్జీలు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

*మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు పలు సమస్యలపై కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వేమనపల్లి మండలం చామనపల్లిలో రైతులను అటవీశాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నట్లు రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఎప్పటి నుంచి పట్టాలు కలిగి ఉండి 45 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న రైతులను ఇబ్బందులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలంటూ పోలీస్ అధికారులను ఆదేశించారు. హాజీపూర్ మండలం పోచంపాడులో ఐటీ హబ్ కోసం సేకరించిన మా భూముల పరిహారం వేరే వారికి ఇచ్చారంటూ దళిత రైతులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఆ భూములను మాకు తిరిగి ఇప్పించి కుటీర పరిశ్రమలు పెట్టుకునేందుకు ప్రోత్సహించాలంటూ విజ్ఞప్తి చేశారు. భీమారం మండలం వెల్లంపల్లిలో కరెంట్ లైన్ కోసమని తన భూమిలో 80 చింతచెట్లను విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నరికి వేశారంటూ బాధిత రైతు అధికారులపై ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో సోమవారం రైతులు చేసిన ముఖ్యమైన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి.* - మంచిర్యాల, మే 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**తమకు రావాల్సిన పరిహారం వేరే వారికి ఇచ్చారంటూ ఫిర్యాదు చేస్తున్న పోచంపాడు దళిత మహిళా రైతులు**

హాజీపూర్ మండలం పోచంపాడు శివారులో సర్వే నంబర్ 46/1 లోని 10 ఎకరాల వ్యవసాయ భూమిని ఆక్రమించుకొని, ఐటీ హాబ్ కోసం మాకు రావాల్సిన పరిహారాన్ని కొందరు వ్యక్తులు స్వాహా చేశారంటూ బాధిత దళిత రైతులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఐటీ హాబ్ ఏర్పాటు చేసేందుకు పోచంపాడులోని దళితుల భూముల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇటీవలే భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం సైతం చెల్లించింది. కాగా దళిత రైతుల పేరుపై ఉన్న భూమిని కొందరు బడా లీడర్లు తమ అనుచరుల పేర్ల పైకి మార్చి.. రైతులకు రావాల్సిన పరిహారాన్ని వారి ఖాతాల్లోకి మళ్లించారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం విచారణ చేసి మా 10 ఎకరాలు మాకు ఇప్పించాలని, ఆ భూముల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహం అందించాలని కలెక్టర్‌ను కోరారు. గత వారమే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరగలేదంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు.

## ఫారెస్ట్ అధికారుల అత్యుత్సాహం..

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టమన్న కలెక్టర్..**

అటవీ అధికారులు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేసిన చామనపల్లిలోని బాధిత రైతులు

'వేమనపల్లి మండలం చామనపల్లిలో సర్వే నంబర్ 65, 67లోని భూమిని స్థానిక రైతులు 45 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారు. 1957లోనే అప్పటి ప్రభుత్వం సర్వే చేసి ఈ రైతులకు పైసల్ పట్టా జారీ చేసింది. మొన్నటికి మొన్న కేసీఆర్ ప్రభుత్వం పోడు పట్టాలు కూడా ఇచ్చింది. ఇలా ఎన్నో ఏండ్లుగా ఆ భూములనే నమ్ముకొని సాగు చేసుకుంటున్న 9 మంది రైతులను అటవీశాఖ అధికారులు కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. ఇప్పటికే ఈ భూముల్లో బోర్లు, స్తంభాలు, విద్యుత్ మోటార్లు సైతం పెట్టుకున్నాం. ఇలా ఏండ్లుగా సాగు చేసుకుంటున్న మా భూముల్లోకి అటవీశాఖ అధికారులు వచ్చి ఇవి అటవీ భూములని, సాగు చేయొద్దని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దాడులు చేసి 9 మంది రైతులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు సైతం పంపించారు. కలెక్టర్‌కు, ఆర్డీవోకు, తహసీల్దార్‌కు, అటవీశాఖ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మీరైనా న్యాయం చేయాలి. ఫారెస్ట్ అధికారులు మా భూముల్లోకి రాకుండా నియంత్రించాలి' అంటూ సోమవారం బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 1957 నుంచి ఉన్న పట్టాలు, గత ప్రభుత్వం ఇచ్చిన పాసుపుస్తకాలను చూపించి మొరపెట్టుకున్నారు. అన్ని పరిశీలించిన కలెక్టర్ ఫారెస్ట్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు బుక్కులు ఉన్న భూముల్లోకి వచ్చి దౌర్జన్యం ఎలా చేస్తారంటూ మండిపడ్డారు. రైతులను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టండంటూ పోలీసులను ఆదేశించారు. 'మీరేం బాధపడకండి నేను చూసుకుంటా' అంటూ భరోసా కల్పించారు. 'రెవెన్యూ భూముల్లోకి ఫారెస్ట్ అధికారులు ఎలా వస్తారు. ఎస్సీ, ఎస్టీ కేసు పెడితేనే వారు దారికి వస్తారు' అంటూ కలెక్టర్ మాట్లాడారు. డీఎస్పీతో మాట్లాడి బాధిత రైతుల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

## కరెంట్ పోల్స్ కోసం 80 చింత చెట్లు నరికేశారు

*భీమారం మండలం వెల్లంపల్లి గ్రామం (కాజీపల్లే శివారు)లో ముడపెల్లి మహేశ్‌కు 4.12 ఎకరాల భూమి ఉంది. దీనికి కంచె వేసుకొని మామిడితోటతో పాటు చింత తోటను సాగు చేస్తున్న సదరు రైతుపై విద్యుత్‌శాఖ అధికారులు దౌర్జన్యానికి దిగారు. కొత్త విద్యుత్ లైన్ పేరుతో పోల్స్ వేసేందుకు తోటలోని చింత చెట్లను నరికివేశారు. రైతు మహేశ్‌కు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా 10 ఏళ్లుగా పెంచుతున్న 80 చింతచెట్లను నేలకూల్చారంటూ రైతు బోరున విలపించాడు. ఎందుకు నరికారని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయాడు. గతేడాది కాతకు వచ్చిన చెట్లను అన్నింటిని విద్యుత్‌శాఖ ఏఈ, ఏడీతో పాటు కాంట్రాక్టర్ నరికివేశారని.. తనకు న్యాయం చేయాలంటూ విన్నవించాడు. 100 సంవత్సరాలు లైఫ్ ఉన్న చెట్లను దౌర్జన్యంగా నరికివేసి లక్షల రూపాయలు నష్టం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. హార్టికల్చర్ అధికారులతో సర్వే చేయించి తనకు జరిగిన నష్టాన్ని అంచనా వేయించి పరిహారం చెల్లించాలని కోరాడు. గత వారమే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ బాధిత రైతు వాపోయాడు. ఈ సారి అధికారులు న్యాయం చేస్తారనే ధీమా వ్యక్తం చేశారు. లేదంటే విద్యుత్‌శాఖ అధికారులు, సదరు కాంట్రాక్టర్‌పై కోర్టుకు వెళ్తానని రైతు మహేశ్ చెప్పుకొచ్చాడు. మరి ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.*

విద్యుత్‌శాఖ అధికారులు నరికివేసిన చింతచెట్లను చూపిస్తున్న బాధిత రైతు మహేశ్

# జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటీ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ కార్పొరేషన్, మే 26 : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో బీ ఆర్స్, బీ ప్లానింగ్‌లో కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బీ ప్లానింగ్ విభాగంలో బీ హితేశ్ 152వ ర్యాంకు, డీ మహేశ్ 227, బీ రేణుక 393, ఏ శరణ్యనందిని 737, ఎం నిఖిత్‌నాయక్ 1031, వీ లత 1092, జీ అజయ్ 1115, ఆర్ ఐశ్వర్య 1272, ఎం అంజనశ్రీ 1388 ర్యాంకు సాధించారు. బీ-ఆర్స్‌లో బీ హితేశ్ 718, డీ మహేశ్ 756, బీ రేణుక 1208, ఆర్ ఐశ్వర్య 1877, ఏ శరణ్యనందిని 1855 సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు నిర్దిష్టమైన ప్రణాళిక, నిరంతర శ్రమ అవసరమని తెలిపారు. వాటితోపాటు క్రమశిక్షణతో విద్యను అందించడం ద్వారా ఈ విజయాలు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యార్థులు సాధించిన ర్యాంకులు ట్రినిటి విద్యా సంస్థల్లో ఉన్నతమైన విద్యా బోధనకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో వారు ఎంచుకున్న రంగాల్లో రాణించి తమ తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

# అభివృద్ధిపై చర్చకు సిద్ధం

**దాడులు, రౌడీయిజం, అక్రమ కేసులపైనా చర్చిద్దాం**

- అవినీతి, అబద్ధాలు అంటేనే పీఎస్సార్
- మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జిని నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 26: మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, సమయం, స్థలం చెప్పాలని ఎమ్మెల్యే పీఎస్సార్‌కు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సవాల్ విసిరారు. సోమవారం మంచిర్యాలలోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్‌కు బీఆర్ఎస్ పార్టీ తరపున రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధితో పాటు అవినీతి, అక్రమాలు, రౌడీయిజం, అక్రమ కేసులపైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అసలు అవినీతి, అబద్ధాలు అంటేనే పీఎస్సార్ అని అన్నారు. మంచిర్యాల-అంతర్గాం వంతెన విషయంలో పీఎస్సార్ రోజుకోరకంగా మాట్లాడుతున్నాడని, ముందు తనకు అంతర్గాంలో భూములు ఉన్నాయని చెప్పారని, తర్వాత వంతెన చిన్నదిగా నిర్మిస్తే ఉపయోగం ఉండదని, ఆ తర్వాతా అప్రోచ్‌రోడ్లు లేవని రకరకాలుగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజల బలమైన కోరిక అయిన ఈ వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. గోదావరిపై నిర్మించిన వంతెనల్లో ఎక్కడా 132 ఫీట్లు వెడల్పుతో రోడ్లు లేవని, 66 ఫీట్ల రోడ్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. లక్ష్మీటాకీసు నుంచి పాతమంచిర్యాల వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణంతో చాలామంది ఇండ్లు దెబ్బతింటాయని, అసలు రహదారులు నాలుగు వరుసలు ఉంటే పట్టణం మధ్యలో నిర్మించే రోడ్డు ఆరు వరుసలు నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంత అభివృద్ధి చేయాలో అంతా చేశానని అన్నారు. మంచిర్యాలలో రూ.14 కోట్లతో బైపాస్‌రోడ్డు నిర్మించామని, పాతమంచిర్యాల నుంచి క్వారీరోడ్డు వరకు రోడ్డు నిర్మాణం, రైల్వే స్టేషన్ నుంచి రాజీవ్‌నగర్ వరకు, తిలక్‌నగర్‌కు, ఇటు గోదావరి నది వరకు రోడ్లు నిర్మించానని అన్నారు. రెండు అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిలు నిర్మించామని, ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం లిఫ్ట్ తన హయాంలో నిర్మించినట్లు తెలిపారు. పీఎస్సార్ పుట్టిన కాసిపేట మండలంలో 13 నీటి ప్రాజెక్టులు ప్రారంభించామని, దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన 20 మంది గిరిజనులకు అందులోనే ఉద్యోగాలు పెట్టించినట్లు తెలిపారు. మంచిర్యాలలో 24 ఎకరాల భూదాన్ భూమిని పీఎస్సార్ అనుచరులు కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తే తాను అడ్డుకున్నానని, మార్కెట్ కమిటీ స్థలాన్ని కాపాడానని, రాజీవ్‌నగర్‌లో 120 ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ అనాథాశ్రమం ఏరియాలో స్థలం కబ్జాకు కాకుండా కాపాడడంతో అక్కడ ఇప్పుడు ఎక్సైజ్, ఇరిగేషన్ కార్యాలయాలు, వాటర్‌ట్యాంకు నిర్మించుకోగలిగామని తెలిపారు. పాత మంచిర్యాల నుంచి రసూల్‌పల్లి వరకు రహదారి వెడల్పు చేసినట్లు తెలిపారు. తన కొడుకు విజిత్ రావును ఏఎస్పీ పిలిచారని పదేపదే అంటున్న ఎమ్మెల్యే ఆ విషయాన్ని ఏఎస్పీతోనే చెప్పించాలని డిమాండ్ చేశారు. కేసుల భయంతో మూడునెలలు పారిపోయిన చరిత్ర పీఎస్సార్‌దేనని అన్నారు.

మంచిర్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### గెలిచిన నాటి నుంచి అక్రమాలే..

ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుంచి పీఎస్సార్ అన్నీ అక్రమాలే చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆరోపించారు. రూ.4 కోట్లతో నిర్మించాల్సిన వైకుంఠధామాన్ని రూ. 12 కోట్లకు పెంచారని, గోదావరిలో ఏడు గుంటలకు అనుమతి తీసుకుని రెండు వేల టిప్పర్ల మట్టిని తరలించారని, మట్టిని తవ్వాక అనుమతులు తీసుకున్నారని అన్నారు. వేంపల్లి, పోచంపాడ్ గ్రామాల్లో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల పేరి ట తక్కువ ధరలకు భూములను తీసుకుని రూ. 200 కోట్ల భారీ అవినీతికి స్కెచ్ వేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కాప్రాలో వందలాది మం ది కొనుగోలు చేసిన ప్లాట్లను కబ్జాచేశారని, వారంతా సెక్రటేరియట్ ఎదుట, డిప్యూటీ సీఎం ముందు గోడు వెల్లబోసుకున్నారని, పలుమార్లు ధర్నాలు చేశారని గుర్తుకు చేశారు. అసలు పీఎస్సార్‌కు చిరాన్‌పోర్టు క్లబ్ ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. రూ. 1400 కోట్ల ఆస్తులు ఎలా కూడబెట్టావో చెప్పాలని డిమాండ్ చేశారు. మోసం, దగా, అక్రమం, అన్యాయంతోనే ఇవన్నీ సాధ్యపడుతాయన్నారు. అన్యాయంగా తప్పుడు కేసులు పెడుతూ ఆ పాపం తగులుతుందని, భవనాలను కూలగొట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, అ శాంతిని నెలకొల్పేందుకు ఎమ్మెల్యేగా గెలిచావా ? అని ప్రశ్నించారు. టెండర్లలో కాంట్రాక్టర్లను పాల్గొనకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని, తమ మనుషులతో ఎక్సెస్ టెండర్లు వేయించి తొమ్మిది శాతం కమీషన్‌ను తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్, బీజేపీల్లో చేరాలని ప్రయత్నించారని, వాళ్లు తిరస్కరించడంతో గత్యంతరం లేకనే కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారని అన్నారు.

### బీజేపీ రఘునాథ్‌వి అహంకారపు మాటలు

బీజేపీ నాయకుడు రఘునాథ్ వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయని, ఆయన మాటలే అతని పతనానికి కారణమవుతాయని దివాకర్‌రావు అన్నారు. విదేశాల్లో ఉన్న మీకు వందల కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. ఏదైనా కంపెనీని ముంచితే తప్ప అంతడబ్బు రాదని ఎద్దేవా చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయడాన్ని అందరం సంతోషించామని, అయితే మోడీ అర్థాంతరంగా యుద్ధాన్ని ఆపేయడాన్నే ప్రశ్నించామన్నారు. యావత్ దేశం కూడా ఈ విషయంలో తప్పపట్టిందన్నారు. బీజేపీ నాయకులు వందేభారత్ రైలుకు మంచిర్యాలలో స్టాప్ కల్పించలేదని, మెడికల్ కాలేజీ తీసుకురాలేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, నాయకులు గాదెసత్యం, పల్లె భూమేశ్, బేర సత్యనారాయణ, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, మొగిలి శ్రీనివాస్, అక్కూరి సుబ్బయ్య, వెంకటేశ్, శ్రీపతివాసు, శ్రీరాముల మల్లేశ్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో తడిసిన వడ్లు

నెన్నెల, మే 26 : మంచిర్యాల జిల్లా మండలంలోని గొల్లపల్లి, మైలారం, జోగాపూర్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కుండ పోతగా కురవడంతో కొనుగోలు కేంద్రాల్లోని కుప్పలతో పాటు సంచుల్లోని వడ్లు తడిపోయాయి. గొల్లపల్లిలో ధాన్యం కుప్పలలోని నీటిని తొలగించేందుకు ఇబ్బంది పడ్డారు. సుమారు పది లారీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని తెలిపారు. వరుసగా వర్షాలు పడడంతో ధాన్యం తడిసి మొలకెత్తుతున్నదని, మరికొంత రంగు మారుతున్నదని, ఇప్పటికైనా అధికారులు కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మైలారం, గొల్లపల్లి, చిత్తాపూర్, కొత్తూర్ గ్రామాల్లో సేకరించిన తునికాకు కట్టలు తడిసిపోవడంతో గిరిజనులు ఇబ్బందిపడ్డారు.

గొల్లపల్లిలో తడిసిన ధాన్యం కుప్పలు

# ధాన్యం తరలింపుపై విచారణ

చెన్నూర్ రూరల్, మే 26 : చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని తీసుకవచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నారనే ఆరోపణలపై సోమవారం డీసీవో మోహన్ విచారణ చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాలేదని, ఎవరూ ఇక్కడ వ్యాపారం చేయడం లేదని రైతులు తెలిపినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఆయన వెంట ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో యామిని, ఏఈవో రాజశేఖర్, పీఏసీఎస్ సీఈవో లక్ష్మీనారాయణ, సిబ్బంది నరహరి శ్రీనివాస్ , తదితరులు ఉన్నారు.